క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: సురక్ష ఎన్‌క్లేవ్ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు చందానగర్‌లోని శ్రీదేవి థియేటర్ రోడ్డు లైన్ విస్తరణలో భాగంగా సురక్ష ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలోని విద్యానగర్, సురక్ష ఎన్‌క్లేవ్, సాయి ఎన్‌క్లేవ్, రాజేందర్‌రెడ్డి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని , వినియోగదారులు సహకరించాలని కోరారు.

శేరిలింగంపల్లి: 11 కేవీ నల్లగండ్ల విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నల్లగండ్ల హుడాకాలనీ, వాటర్ ట్యాంక్ ఏరియా, రత్నదీప్ సూపర్ మార్కెట్ వెనుకవైపు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తారానగర్ సబ్‌స్టేషన్ అధికారులు తెలిపారు.

- 11 కేవీ లేక్‌వ్యూ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సిటిజన్ ఆస్పత్రి రోడ్డు, లేక్ వ్యూ అపార్ట్‌మెంట్స్, శ్రీకృష్ణ కాలనీ, నల్లగండ్ల విలేజ్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని వివరించారు.

గచ్చిబౌలి: విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టీఎన్‌జీఓస్ ఫేజ్–2 మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు టీఎన్‌జీవోస్ కాలనీ ఫేజ్–2, ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రశాంతిహిల్స్, రాయదుర్గం, రాయదుర్గం పోలీస్ స్టేషన్, ఓరియన్ విల్లాస్, బయో డైవర్సిటీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం సాగుతుంది. ఈ సందర్భంగా 'హియరింగ్ కేర్ ఫర్ ఆల్' అనే అంశంపై మీనాక్షి వెంకట్రామన్ ఫౌండేషన్ ఆపరేషన్స్ డైరెక్టర్ ఎం రంగనాథన్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించవచ్చు.

సాయినగర్‌లో బీజేపీ రవన్న ప్రజాయాత్ర



సాయినగర్‌లో ప్రచారం చేస్తున్న రవికుమార్ యాదవ్

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయినగర్‌లో గడపగడపకు బీజేపీ రవన్న ప్రజాయాత్ర శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు కబ్జాలు చేస్తూ అధికారులతో కుమ్మక్కై నకిలీ కరెంటు మీటర్లు, అక్రమ నల్లా కనెక్షన్లు తీసుకొని సొమ్ము చేసుకుంటున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ హయాంలో అభివృద్ధి జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో శేరిలింగంపల్లి గడ్డపై కాషాయ జెండా ఎగరవేస్తామన్నారు. ఈ పాదయాత్రలో బీజేపీ పార్టీ డివిజన్ అధ్యక్షులు శ్రీధర్‌గౌడ్, కంటెస్టెడ్ కార్పొరేటర్ అనూష మహేష్ యాదవ్, నాయకులు మహేష్ యాదవ్, లక్ష్మణ్ గౌడ్, రవి గౌడ్, శ్రీశైలం, మాణిక్‌రావు, శ్రీనివాస్ యాదవ్, లక్ష్మణ్, ప్రసాద్, పృథ్వీ గౌడ్, రవి ముదిరాజ్, అశో తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఈస్ట్ సాయినగర్‌లో రోడ్డు, డ్రైనేజీ సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకురాగా శుక్రవారం ఆయన సాయినగర్ వెస్ట్‌లో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నంబర్ 2, 4 మెయిన్‌రోడ్డులో డ్రైనేజీ శాంక్షన్ అయిందని త్వరలో పనులు మొదలుపెడతామని తెలిపారు. అనంతరం సీసీ రోడ్లు వేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, జైహింద్, శేఖర్‌రెడ్డి, నిఖిల్‌రెడ్డి, భారత్‌కుమార్, దినేష్, బాలీశ్వర్, రామచంద్రారెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురు వైద్యచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.13లక్షల 69 వేల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కార్పొరేటర్‌లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, రాగం నాగేందర్‌యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఏసీ బస్టాప్ ఉన్నా.. బయటే..

మాదాపూర్ శిల్పారామం వద్ద ప్రయాణికుల దుస్థితి

మాదాపూర్: లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఏసీ బస్టాప్ నిరుపయోగంగా మారింది.అన్ని హంగులతో 40లక్షల రూపాయలు వెచ్చించి ప్రయాణికుల కోసం శిల్పారామం ఎదుట ఏర్పాటు చేశారు. అయితే నిర్వహణ లోపం వల్ల అధ్వానంగా మారింది. నిత్యం వందలాది మంది ప్రయాణికులు మాదాపూర్ నుండి వివిధ ప్రాంతాలకు ప్రయాణం చేస్తుంటారు. ఇక్కడ ప్రయాణికులకు వైఫై, తినుబండారాల కోసం చిన్న స్టోర్, చిన్నపిల్లల ఫీడింగ్‌కు ప్రత్యేక గది, కాఫీ షాప్, మూత్రశాలలు ఏర్పాటు చేశారు. చుట్టూ సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేశారు. కానీ కొద్ది రోజులకే అది నిరుపయోగంగా మారింది. రోడ్డు పక్కనే నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రణాళిక బద్ధంగా నిర్వహణ లేకపోవడం వల్ల ప్రయాణికులకు అందుబాటులోకి రావడం లేదన్నారు.



మాదాపూర్‌లోని శిల్పారామం వద్ద ఉన్న ఏసీ బస్టాప్



పిచ్చిమొక్కలు పెరిగిపోయిన దృశ్యం





ఏసీ బస్టాప్ వద్ద వృథాగా స్టాల్స్, టాయిలెట్స్

పేరుకే ఏసీ బస్టాప్..



ఏసీ బస్టాప్ ప్రారంభించిన కొత్తలో ప్రయాణికులు సంతోషపడ్డారు. అది కొంతకాలానికే నిరుపయోగంగా మారింది. మాదాపూర్ ప్రాంతం నుండి వేలాది మంది ప్రయాణం చేస్తుంటారు. ఎలాంటి మౌలిక వసతులు లేకపోగా రోడ్డు బైటనే నిలబడాల్సి వస్తుంది. మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

–జేడీ, ప్రయాణికుడు,

సాధారణ బస్టాప్‌గా మార్చాలి



ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, సీనియర్ సిటిజన్‌లు కూర్చోడానికి కూడా వీలు లేదు. బస్టాప్ లోపల కూర్చోవడానికి లేకుండా తాళాలు వేశారు. ఎవ్వరు వినియోగించుకోలేని పరిస్థితి. కనీసం సాధారణ బస్టాప్‌గా వాడుకలోకి తీసుకురావాలి. అధికారులు, నాయకులు స్పందించాలి.

– లక్కీ, స్థానికుడు

నేటి యువత వారి బాధ్యతలను గుర్తెరగాలి

- జేఎన్టీయూ ప్రొఫెసర్ చంద్రశేఖరయ్య
- ఘనంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ చంద్రశేఖరయ్య

రామచంద్రాపురం (పటాన్‌చెరు): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జేఎన్టీయూ ప్రొఫెసర్ చంద్రశేఖరయ్య అన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవ సందర్భంగా బీహెచ్ఈఎల్ కాలనీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిపోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేఎన్టీయూ ప్రొఫెసర్ చంద్రశేఖరయ్య మాట్లాడుతూ ఈ ఏడాది అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని యువతకు పచ్చదనపు నైపుణ్యం అనే నినాదంతో ఐక్యరాజ్యసమితి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా నేటి యువతకు వారి బాధ్యతలను గుర్తు చేసేందుకు, వారి శక్తిని చాటేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా సన్మార్గంలో నడిచి పదిమందికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. యువతపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖిత్ అంజుమ్, వైస్ ప్రిన్సిపల్ జ్యోతి పాల్గొన్నారు.

మహిళలు శక్తియుక్తులతో ముందుకు సాగాలి



గెట్ టు గెదర్‌లో పాల్గొన్న కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతో డాక్టర్ శిల్పిరెడ్డి

- డాక్టర్ శిల్పిరెడ్డి

గచ్చిబౌలి: మహిళలు శక్తివంతంగా ముందుకు సాగాలని డాక్టర్ కె శిల్పిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ కె శిల్పిరెడ్డి పేర్కొన్నారు. డాక్టర్ శిల్పిరెడ్డి ఫౌండేషన్, సీఐఐ–ఐడబ్ల్యూఎన్ ఆధ్వర్యంలో కార్పొరేట్ మహిళల గెట్ టు గెదర్ ప్రత్యేక కార్యక్రమాన్ని శుక్రవారం కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు ఎదురవుతున్న సవాళ్ళను అధిగమించడానికి, ఎదురుదెబ్బల నుంచి కోలుకోవడానికి, వారి పూర్తి సామర్థ్యాన్ని సాధించడానికి అవసరమైన సాధనాలు, మద్దతును అందించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. మహిళలు వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో అభివృద్ధి చెందడానికి అవసరమైన నైపుణ్యాలతో వారిని సన్నద్ధం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు, వివిధ కార్పొరేట్ సంస్థల వారు పాల్గొన్నారు.

కోట్ల రూపాయలతో డివిజన్ల అభివృద్ధి

పటాన్‌చెరు: కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ, శ్రీరామ్‌నగర్ కాలనీ, శాంతినగర్ కాలనీలలో కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శుక్రవారం స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ పరిధిలోని పటాన్‌చెరు రామచంద్రాపురం, భారతీనగర్, డివిజన్ల పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ప్రభుత్వం ఇటీవల 22 కోట్ల రూపాయల నిధులు కేటాయించిందని తెలిపారు. ప్రతి వార్డులో ఓపెన్‌జిమ్, పార్కులు, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, మాజీ వార్డు సభ్యులు వీరారెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని బాలుడు మృతి

మియాపూర్: ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ గిరీష్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఈస్ట్ గోదావరి జిల్లా పెద్దపూడి మండలానికి చెందిన రాయుడి దుర్గప్రసాద్, సంధ్య దంపతులకు కూతురు కీర్తి, కుమారుడు రాయుడు రిషి కుమార్(రెండున్నర సంవత్సరాలు). మియాపూర్ మదినాగూడలోని దీప్తిశ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. దుర్గాప్రసాద్ స్థానికంగా కారు డ్రైవర్. ఈ క్రమంలో బాలుడు రిషి కుమార్ శుక్రవారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటుండగా గుర్తు తెలియని కారు బాలుడిని ఢీకొట్టి వెళ్లింది. బాలుడు ఏడవడంతో తల్లిదండ్రులు బయటకు వచ్చి చూసే సరికి బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే దగ్గరలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు పరీక్షించి బాలుడు మృతి చెందినట్లు తెలిపారు. బాలుడిని ఢీకొన్న కారు డ్రైవర్ పారిపోయాడు. బాలుడి తండ్రి మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం బాలుడి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించామని, సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని ఎస్ఐ గిరీష్ తెలిపారు.

ప్రత్యేక పూజలు

రాయదుర్గం: మధురానగర్ ఎదురుగడ్డ మైసమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 16న అమ్మవారికి లక్ష గాజుల అలంకారం చేయాలని నిర్ణయించినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రధాన అర్చకులు సాయిశర్మ తెలిపారు. కాగా సెప్టెంబర్ 12వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన జరుగుతుందని వివరించారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు ఉచితంగా పూజా సామగ్రి అందించడం జరుగుతుందని వారు వివరించారు. పూజ అనంతరం భక్తులకు పసుపు,కుంకుమ, గాజులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

యువకులకు కౌన్సిలింగ్

మాదాపూర్: హైటెక్‌సిటీలో గురువారం రాత్రి 11 గంటల సమయంలో హల్‌చల్ చేసిన 5 మంది యువకులను పెట్రోలింగ్ సిబ్బంది అదుపులోకి తీసుకున్న సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. రాత్రిపూట భోజనానికి వచ్చి దురుసుగా ప్రవర్తించిన వారిని అదుపులోకి తీసుకుని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చి పంపించినట్టు పోలీసులు తెలిపారు.

కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఏడుగురికి కొవిడ్ ర్యాపిడ్ యాంటీజన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా 10 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

నియామకం

రాయదుర్గం: నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీలో ఇద్దరు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థులకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌నర్సింగరావు, రాష్ట్ర ఇన్‌చార్జీ అక్షయ్‌లక్రా నియామకపత్రాలను అందించారు. ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శులుగా సి సునీల్‌కుమార్, సోమన్నగారి రచనారెడ్డిలను నియమించారు. ఎన్ఎస్‌యూఐ హెచ్‌సీయూ శాఖకు సునీల్‌కుమార్ అధ్యక్షుడుగా పనిచేశా రు. ప్రస్తుతం రచనారెడ్డి ఎన్ఎస్‌యూఐ హెచ్‌సీయూ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

మాదాపూర్ బీ న్యూ స్టోర్‌లో కొత్త మొబైల్స్ ఆవిష్కరణ

మాదాపూర్: మాదాపూర్‌లోని 'బీ–న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ స్టోర్స్'లో శుక్రవారం సామ్‌సాంగ్ గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 5, జెడ్ ఫ్లిప్ 5 మొబైల్స్‌ను హీరోయిన్ సినీనటి హెబ్బాపటేల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఎండీ బాలాజీ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయినితేష్, సామ్‌సాంగ్ ఆర్ఎస్ఎం సుమిత్ కుకరేజ్, ఆర్ఎంఎం సౌరభ్, ఆర్‌డీఎం నాగూర్ తదితరులు పాల్గొన్నారు. అత్యాధునిక మొబైల్స్‌పై తమ స్టోర్లలో బెస్ట్ ఆఫర్లు లభిస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు.



బీన్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ స్టోర్‌లో నూతన మోడల్స్ ఆవిష్కరించిన సినీనటి హెబ్బాపటేల్

భారత్‌లో కేన్సర్ వ్యాధి వేగంగా పెరుగుతోంది

కాంటినెంటల్ ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఛైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి

రాయదుర్గం: భారతదేశంలో కేన్సర్ వేగంగా పెరుగుతోందని కాంటినెంటల్ ఆస్పత్రి ఛైర్మన్, ప్రముఖ గ్యాస్ట్రోంటరాలజిస్ట్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి అన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కేన్సర్ కేర్ స్పెషల్ సెంటర్‌ను శుక్రవారం మరింత ఆధునికీకరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు, వృద్ధాప్య జనాభా, మెరుగైన రోగనిర్ధారణ పద్ధతులు అందుబాటులో లేని కారణంగా దేశంలో కేన్సర్ వేగంగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రఖ్యాత సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ పి.జగన్నాథ్ మాట్లాడుతూ దేశంలోని కేన్సర్ కేర్‌కు సంబంధించిన ప్రధాన సంస్థల్లో అగ్రగామిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. కాంటినెంటల్ ఆస్పత్రిలో 30 మందికి పైగా మెడికల్, సర్జికల్, రేడియేషన్ అంకాలజిస్టుల బృందం అందుబాటులో ఉంటుందన్నారు.

భవన నిర్మాణానికి స్థల పరిశీలన



మెడికల్ ఆఫీసర్‌తో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తెలిపారు. శుక్రవారం శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీలో సీఎస్ఆర్‌లో భాగం సుమారు రూ.35 లక్షలతో నిర్మించనున్న భవనానికి నిర్మాణ స్థలాన్ని అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ యూపీహెచ్‌సీని ఆధునికీకరించేందుకు నిధుల కేటాయింపునకు చొరవ తీసుకున్న చేవెళ్ళ ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శైలజ, బీఆర్ఎస్ డివిజన్ గౌరవాధ్యక్షులు వీరేశం గౌడ్, నాయకులు జనార్ధన్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, రవియాదవ్, మహేష్ చారి, నర్సింహ, ముంతాజ్ బేగం, సీహెచ్ఓ స్వామి, సిబ్బంది పాండుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రప్రదర్శన ప్రారంభం



ఆకట్టుకుంటున్న చిత్రాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ఎ ఫెస్ట్ ఫర్ ద ఐస్ పేరిట ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను తెలంగాణ రాష్ట్ర అడ్వైసర్ డాక్టర్ కే.వి రమణాచారి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారుడు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని కొనియాడారు. ఈనెల 16వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో 40 చిత్రాలను అందుబాటులో ఉంచారు. ఉదయం 10గంటల నుంచి రాత్రి 7గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్.కె.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బ్రాకీథెరపీ వర్క్‌షాపు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ (ఏఓఐ)లో ప్రొస్టేట్ క్యాన్సర్‌పై బ్రాకీథెరపీ వర్క్‌షాప్‌ను శుక్రవారం నిర్వహించారు. రేడియేషన్ ఆంకాలజిస్టులు, మెడికల్ ఫిజిస్ట్‌లకు నిపుణులైన అంతర్జాతీయ ఫ్యాకల్టీచే బ్రాకీథెరఫిపై లైవ్ కేస్ డెమో నిర్వహించారు. సొసైటీ ఆఫ్ రేడియేషన్ ఆంకాలజీ ఫెలో, అమెరికన్ బ్రాకీథెరపీ సొసైటీ డాక్టర్ సుశీల్ బేరివాల్, డాక్టర హర్జోత్ కౌర్‌లు మాట్లాడుతూ ప్రొస్టేట్ క్యాన్సర్ చికిత్స బ్రాచిథెరపీలో రేడియేషన్‌ను నేరుగా ప్రొస్టేట్ గ్రంథిలోకి ప్రవేశపెడతారని, దీంతో రేడియేషన్ ఆ ప్రాంతానికి పరిమితమవుతుందని శరీరం మొత్తాన్ని ప్రభావితం చేయదన్నారు. డాక్టర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పరేడ్

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో వార్షిక ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా శుక్రవారం నిర్వహించిన సెరిమోనియల్ పరేడ్ ఆకట్టుకుంది. బెటాలియన్ కమాండెంట్ సి సన్నీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. ముఖ్య అతిథిగా టీఎస్ఎస్‌పీ డీఐజీ ఎం ఎస్ సిద్ధిఖీ పాల్గొన్నారు. అనంతరం సిబ్బందిచే గౌరవ వందనాన్ని స్వీకరించారు. పరేడ్ కమాండర్‌గా అసిస్టెంట్స్ కమాండెంట్ డి నారాయణదాసు వ్యవహరించారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ రామకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్స్ రహమాన్, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ర్యాలీ

ఆల్విన్‌కాలనీ: ప్లాస్టిక్ వాడకం వల్ల మానవ మనుగడకు హాని కలుగుతుందని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం గీతాంజలి ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు 'సోషల్ కాజ్ డ్రైవ్ టు ఇంప్రూవ్ ది నైబర్‌హుడ్' ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ ప్రారంభించారు. విద్యార్థులతో ఎల్లమ్మబండలో జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులు వాడకూడదని వీటిని ఎక్కడ పడితే అక్కడ పడవేయటంతో మూగజీవాలు తిని మృతి చెందుతున్నాయని పేర్కొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

మాదాపూర్: నారాయణ కళాశాలలో ఇంటర్ బైపీసీ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని నారాయణ కళాశాల హాస్టల్‌లో ములుగు మండలం, మామిడాల కు చెందిన కనకరాజు అనే విద్యార్థి బైపీసీ ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. సాయంత్రం 3గంటల సమయంలో అటెండెన్స్ తీసుకుంటున్నప్పుడు కనకరాజు తరగతి గదిలో లేకపోవడంతో వెతికారు. తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. పోలీసులు కేసునమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నారు.

నా కొడుకును కొట్టి చంపారు: తండ్రి సత్తయ్య.

రెండు గంటల సమయంలో కండ్ల కలక, జ్వరం వచ్చిందని ప్రిన్సిపల్ చెప్పాడని, పంపించమంటే కుదరదని అదే తగ్గిపోతుందన్నారు. ఆసుపత్రిలో చూపిస్తామని చెప్పారు. మీ కొడుకు ఎక్కువగా మాట్లాడుతున్నాడని, ఎక్స్‌ట్రాలు చేస్తున్నాడని చెప్పారు. నా కొడుకును వాళ్ళే కొట్టి చంపారు. గంటల తరబడి ఫోన్‌లు చేసిన సమాధానం చెప్పలేదు.

ఏబీవీపీ కార్యకర్తల ధర్నా......

అధిక ఫీజులతో విద్యార్థులను వేధిస్తున్నారంటూ ఏబీవీపీ కార్యకర్తలు ధర్నా చేశారు. చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం న్యాయం చేయాలని కోరారు.